రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణమెప్పుడో?

- నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు
- రైల్వేలైన్ల విస్తరణతో కుందనపల్లి రైల్వే గేటు మూత


కుందనపల్లి రైల్వేగేటు

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న కుందనపల్లి రైల్వేగేటు (లెవల్ క్రాసింగ్-49) వద్ద ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి మోక్షం ఎప్పుడోనని స్థానికులు ఎదురు చూస్తున్నారు. కుందనపల్లి రైల్వేగేటుతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులతో పాటు ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణానికి తీసుకుంటున్న చర్యలపై దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ గ్రీవెన్స్‌లో పలువురు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వంతెన నిర్మాణంలో జాప్యం జరుగుతోందని గ్రీవెన్స్ సెల్ విభాగం లిఖితపూర్వక సమాధానమిచ్చింది. రైల్వే ట్రాక్‌పై నిర్మించే వంతెన పోర్షన్‌కు సంబంధించి జనరల్ అరెంజ్‌మెంట్ డ్రాయింగ్ (జీఏడీ) నుంచి నిధుల కేటాయింపునకు అప్రూవల్ కాగా వంతెనకు (ట్రాక్) ఇరువైపులా అప్రోచ్‌రోడ్ నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ నుంచి నివేదికలు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని రైల్వేశాఖ పేర్కొంది.

రైల్వేగేటు తెరిచి ఉంటేనే చర్చ..

రామగుండం నుంచి పెద్దపల్లి వైపు వెళ్లే మార్గంలో కుందనపల్లి రైల్వేగేటు తెరిచి ఉందంటేనే ఆసక్తిగా చర్చ జరుగుతుంది. రైల్వేశాఖ న్యూఢిల్లీ నుంచి చెన్నైని గ్రాండ్ రూట్‌గా పరిగణించడంతో కోట్లాది నిధులతో దశల వారీగా మూడు రైల్వేలైన్లుగా విస్తరిస్తోంది. రైల్వేగేట్లను ఎత్తివేయడం, గేట్ల స్థానంలో భూగర్భ, ఫ్లైఓవర్ వంతెనలు నిర్మించడం, రైళ్ల వేగాన్ని పెంచి, హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టి ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఇలాంటి తరుణంలో కుందనపల్లి వద్ద ఐదు రైల్వే లైన్లు ఉండడం గమనార్హం. ఇందులో ఒకటి గోదావరిఖని బొగ్గు గనుల ట్రాక్, ఇంధన డిపోలకు వెళ్లే ట్రాక్‌తో పాటు మూడు ప్రధాన రైల్వేట్రాక్స్ ఉన్నాయి. ఫలితంగా ప్రతీ ఐదు నిమిషాలు గేటు తెరిచి ఉంచే పరిస్థితి లేకుండా పోతుంది. ఇప్పటికైనా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

సమయం కంటే ముందుగానే డ్యూటీకి వెళ్తున్నాం



బొగ్గు గనుల వైపు డ్యూటీలో చేరేందుకు మల్యాలపల్లి క్యాబిన్ వద్ద లోకో పైలట్స్ సిద్ధంగా ఉండాలి. అందుకు కుందనపల్లి రైల్వే గేటు మీదుగా వెళ్లేందుకు రైల్వేశాఖ ప్రత్యేక వాహనాన్ని సమకూర్చింది. మధ్యలో గేటు అడ్డుగా ఉండడంతో ముందుగానే విధులకు బయలుదేరాల్సి వస్తుంది. వంతెన ఉంటే ఐదు నిమిషాల్లో విధుల్లో చేరే అవకాశం ఉంది.
– రవి, లోకోపైలట్, రామగుండం

అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు రావు



కుందనపల్లిలో అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారికి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించాలంటే పేషెంట్‌ను రైల్వే గేటు బయటకు తీసుకురావాలని అంబులెన్స్ నిర్వాహకులు స్పష్టం చేస్తుంటారు. ఒకవేళ గ్రామానికి వచ్చినా తిరుగు ప్రయాణంలో గేటు వేసి ఉండడంతో పేషెంట్ ప్రాణాలు పోవాల్సిందే. దీనిపై రైల్వేశాఖ దృష్టి సారించాలి.
– ఆటేటి గణేశ్, కుందనపల్లి

క్లుప్తంగా

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు వేగవంతం చేయాలి


పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సుల్తానాబాద్: పట్టణంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తో పాటు పలు రకాల పనులను ఆయన పరిశీలించారు. మార్కెట్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. హరితహారంలో భాగంగా నర్సరీలో మొక్కలు పెంపకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు .ఆయన వెంట కమిషనర్ నరసింహ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై ఎస్ఈకి వినతి


వినతి పత్రం అందిస్తున్న రహీం

జ్యోతినగర్: ఐదో డివిజన్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ విభాగం సూపరింటెండెంట్ బి.సుదర్శనంకు జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎండీ రహీం బుధవారం వినతి పత్రం అందించారు. డివిజన్‌లోని మల్కాపూర్, శ్రీనగర్‌కాలనీ, ప్రశాంతినగర్‌లో విద్యుత్ తీగెలు ఇళ్లపై నుంచి, చెరువు నుంచి ఉండటం వలన డివిజన్లో నిత్యం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని 11 కేవీ విద్యుత్ తీగెలను ఇతర మార్గం నుంచి వేయాలని కోరినట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

ఎలిగేడు: సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగపరుస్తూ సమాచారం దాస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో బద్రి శ్రీనివాస మూర్తికి ముప్పిరితోట గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కందుల కొమురయ్య ఫిర్యాదు చేశారు. డిసెంబర్ 6న ముప్పిరితోట గ్రామపంచాయతీ రికార్డుల కోసం సమాచారహక్కు చట్టం ద్వారా వినతి పత్రాన్ని అందజేశామని, నెల దాటినా సమాచారం ఇవ్వకుండా పొంతనలేని సమాధానాలు చెప్తూ కార్యదర్శి కాలయాపన చేస్తున్నాడని, పంచాయతీ రికార్డులు డీపీవో, ఎంపీడీవోలు తీసుకవెళ్లారని సమాధానం ఇచ్చాడని తెలిపారు. అడిగిన సమాచారం ఇవ్వని పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలి


క్రీడా సామగ్రి అందిస్తున్న మనోహర్‌రెడ్డి

జూలపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చి ముందుండాలని నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నల్ల మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు వాలీబాల్,క్రికెట్ కిట్లు, రింగులు,షటిల్ క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని సూచించారు. క్రీడా సామగ్రి అందించిన మనోహర్ రెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

పోలీస్ ఉద్యోగార్థులకు శిక్షణ

రామగిరి: పోలీసు ఉద్యోగాల కోసం రాత పరీక్షకు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆర్జీ- 3 ఎస్‌ఓటూ జీఎం, శిక్షణ కన్వీనర్ జి. రఘుపతి తెలిపారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 90 మంది అభ్యర్థులకు ఉచితంగా ఫిజికల్ (ఈవెంట్స్)లో శిక్షణ అందించగా వారిలో 58 మంది క్వాలిఫై అయినట్లు తెలిపారు. వీరికి రాత పరీక్ష కోసం ఉచితంగా శిక్షణ అందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రాక్టికల్‌గా అనుభవం , ఆసక్తి కలిగిన ఇన్‌స్ట్రక్టర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో శిక్షణ పొందేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు, శిక్షణ ఇచ్చేందుకు ఇన్‌స్ట్రక్టర్లు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

'చెక్‌డ్యాంల పేరుతో అక్రమ ఇసుక రవాణా'


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం: చెక్‌డ్యాంల పేరుతో మానేరు నదిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డబాలాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం అన్నారు. బుధవారం మండలకేంద్రంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మానేరు నదిలో ఇష్టారాజ్యంగా క్వారీలకు అనుమతులు ఇవ్వడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్‌డ్యాంలు నిర్మిస్తే నీరు నిల్వ ఉండి పంటల సాగుకు ఇబ్బంది ఉండదని, కానీ క్వారీల పేరుతో ఉన్న ఇసుకను తీసుకుపోయి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. ఖమ్మంపల్లిలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేబ్రిడ్జి కాంటా నిర్మిస్తున్నారని కలెక్టర్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వెనక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. కాంట్రాక్టర్‌లు ఇష్టారాజ్యంగా ఓవర్‌లోడ్‌తో లారీలు నడుపుతున్నారని టీఎస్ఎండీఎస్ అధికారి రాం ప్రసాద్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేస్తే దురుసుగా మాట్లాడారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో దళిత జర్నలిస్టులకు ప్రాధాన్యత


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో దళిత జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌కు వచ్చిన మంత్రికి ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. దళితబంధు పథకాన్ని వీలైనంత త్వరగా అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మల్లేశ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, నగేశ్ తెలిపారు.

శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి శ్రీమల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలయంలో గత 40ఏళ్లుగా బ్రహ్మోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతోపాటు అన్నదానం, మల్లికార్జునస్వామి కథలను ఒగ్గు పూజారులచే ఆలపిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 14న శనివారం సాయంత్రం ఆలయంలో దిష్టికుంభం, 16న సోమవారం ఉదయం స్వామివారికి లగ్నపట్నం, 18న నాగవెల్లిపట్నం అన్నదానం ఉంటుందని ఆలయకమిటీ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు అన్ని సౌకర్యాలను కల్పించామని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి


కార్మికులకు సామగ్రి అందిస్తున్న చైర్‌పర్సన్

సుల్తానాబాద్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత గౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు, వాటర్ సప్లై సిబ్బందికి సబ్బులు, కొబ్బరి నూనె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు డ్రైయినేజీలను శుభ్రపరుస్తూ, పట్టణానికి సుందరంగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రేవల్లి తిరుపతి, దున్నపోతుల రాజయ్య, గుర్రాల శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ సాజిద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, ముత్యం రమేష్ గౌడ్ చింతల రాజు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏజీఎంకు సన్మానం

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా యూఎంటీఐ డీజీఎంగా పనిచేస్తూ ఏజీఎంగా బదిలీపై వెళ్తున్న నాగరాజును బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం అబ్దుల్ నలీం, సేఫ్టీ అధికారి రవీందర్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అవార్డు గ్రహీతకు సన్మానం

ఎలిగేడు: మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ యువజన ప్రవాసి దివస్‌లో మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర యువజన శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ధూళికట్ట గ్రామానికి చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత కొండ రవియాదవ్‌ను శిల్పారామంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్రయూత్ కమిషనర్ వెంకటేశ్వర్లు సన్మానించి, మెమెంటో అందజేశారు. తన సేవలను గుర్తించి సన్మానించడంతో మరింత బాధ్యతను పెంచిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణి కార్మికుడికి సన్మానం

గోదావరిఖని: ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవడానికి గోదావరిలో దూకిన మహిళను కాపాడిన సింగరేణి కార్మికుడు శ్రీనివాస్‌ను బుధవారం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ సన్మానించారు. ధైర్య సాహసాలతో ముగ్గురి ప్రాణాలను కాపాడిన శ్రీనివాస్‌కు రాష్ట్రపతి అవార్డు ఇవ్వాలని కోరారు.

విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో డిప్లమా ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని కళాశాల చైర్మన్ అడవల్లి నవీన్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

స్వర్ణకారులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

కాల్వశ్రీరాంపూర్: స్వర్ణకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు రంగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పాండవుల గుట్ట జ్ఞానసరస్వతీశ్వరాశ్రమంలో బుధవారం నిర్వహించిన స్వర్ణకారుల సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మారుపాక రాజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బొజ్జ వెంకటేశ్వర్లు, రాజమౌళి, రాజు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

జ్యోతినగర్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఈడీ సునీల్‌కుమార్ అన్నారు. పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని లలిత కళా ప్రాంగణంలో సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ వార్షికోత్సవాలను ప్రారంభించారు. విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏజీఎం (హెచ్‌ఆర్) విజయలక్ష్మి, హెచ్ఎం ఆరంజ్యోతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

కమాన్‌పూర్: ఉపాధి హామీ సిబ్బంది విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ అన్నారు.మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కమాన్‌పూర్, రామగిరి,ముత్తారం మంథని మండలాల ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఏపీవోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జాబ్ కార్డ్‌దారుల ఆధార్ సీడింగ్, ఎన్ఎంఎంఎస్ ఆప్, నర్సరీల నిర్వహణపై గ్రా మ పంచాయతీల వారీగా సమీక్ష నిర్వహించారు. సహాయ ప్రాజెక్టు సంచాలకులు సత్యనారాయణ, ఎంపీడీవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పీజీ కళాశాలలో జాతీయ యువజనోత్సవాలు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ యువజనోత్సవాలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రమాకాంత్ స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వై.ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఎన్డీఆర్ఎఫ్ రిహార్సల్స్


ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ఎన్డీఆర్ఎఫ్ బృందం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి, గోలివాడ పంపుహౌజ్‌లను బుధవారం జాతీయ విపత్తు నివారణ సంస్థ (ఎన్డీఆర్ఎఫ్) బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వరదల సమయంలో జరిగే విపత్తుల నుంచి సురక్షితంగా బయటపడే చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, తహసీల్దార్ కత్రోజు వేణుగోపాల్, సర్పంచులు ధర్ని రాజేష్, బాదరవేణి స్వామి, గుమ్ముల రవీందర్, ఎన్డీఆర్ఎఫ్ సీఐ టీహెచ్.బిటిన్‌సింగ్, బెటాలియన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవీ రంగ నాయకుల కల్యాణం


సుల్తానాబాద్ లో స్వామివారి కల్యాణం

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో గోదారంగనాయకుల స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం జరిపించారు. తిరుప్పావై మహోత్సవంలో భాగంగా కుడారై అనే విశేష పాశురం స్వామివారికి అనుసంధానం చేశారు. భక్తులు అమ్మవారి తరుపున 108 గంగాళాల్లో పాయసాన్ని నింపి స్వామి వారికి నివేదించారు. భక్తులందరూ మంగళ హారతులతో అమ్మవారికి విశేషమైన హారతి పాటలతో మొక్కులు చెల్లించుకున్నారు.

కుమ్మరికుంటలో..

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీ గోదారంగనాథ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో సర్పంచ్ సంతోశ్‌రావు దంపతులు,ఎంపీటీసీ మల్లేశం, నాయకులు కుంట రాజేశ్వర్‌రెడ్డి, పురోహితులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కుడారై ఉత్సవం

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం కుడారై ఉత్సవాన్ని నిర్వహించారు. స్వామివారికి పాయసం తయారు చేసి నైవేద్యం సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం కుడారై ఉత్సవాన్ని భక్తుల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాలలో శ్రీ గోదారంగనాథుల కళ్యాణోత్సవంలో భాగంగా కుడారై ఉత్సవాన్ని నిర్వహించి భక్తులకు పాయసాన్ని పంపిణీ చేశారు.

రంగనాథ స్వామికి 108 గంగాళాల నైవేద్యం


రంగనాథ స్వామికి నైవేద్యం

గోదావరిఖని టౌన్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక శ్రీ కోదండ రామాలయంలో శ్రీ గోదా రంగనాథస్వామికి 108 గంగాళాల్లో పరమాన్నాన్ని నైవేద్యంగా పెట్టారు. ఆలయ అర్చకులు గోవర్ధనగిరి మధుసూదనాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 13 శుక్రవారం జరగనున్న శ్రీ గోదారంగనాథస్వామివారికి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అంగరంగ వైభవంగా పాయసోత్సవం

రామగిరి: మండలంలోని లద్నాపూర్ శ్రీదేవి భూదేవి సహిత శ్రీగోదారంగనాయకుల, శ్రీదాసాంజనేయ ఆలయంలో బుధవారం పాయసోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారు జామున ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల శ్రీనివాసాచార్యులు శ్రీగోదారంగనాయకులకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పాయసోత్సవం కార్యక్రమంలో భాగంగా 108 మంది మహిళలకు గంగాళాల్లో పాయసం పోసి పంపిణీ చేశారు. భక్తులు, మహిళలు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి


ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న లక్ష్మణ్‌కుమార్

పాలకుర్తి: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముంజంపల్లిలో శ్రీవెంకటేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని గెలుపుకోసం కృషి చేయాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ఆశోక్, నాయకులు శైలేందర్‌రెడ్డి, సింగిరెడ్డి లింగారెడ్డి, బాలసాని మల్లేశ్ గౌడ్, యూత్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు కంటి వెలుగు జీపీడీపీపై సమావేశం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలపరిషత్ సమావేశ మందిరంలో గురువారం సర్పంచులు, ఎంపీటీసీలు, , కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజు తెలిపారు. సమావేశంలో జీపీడీపీ ప్రణాళికల తయారీ, ఈ- గ్రామ్‌స్వరాజ్, కంటివెలుగు కార్యక్రమం విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై చర్చిస్తారని పేర్కొన్నారు.

ఎలిగేడు: మండలపరిషత్ కార్యాలయంలో నేడు జీపీడీపీ లో చేపట్టవలసిన పనులు, కంటి వెలుగుపై అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసమూర్తి తెలిపారు.

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం 12గంటలకు కంటివెలుగుపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీపీ బాలాజీరావు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

జూలపల్లి: 'కంటి వెలుగు' కార్యక్రమం విజయవంతానికి తీసుకోవలసిన చర్యలపై మండల స్థాయి అధికారులతో నేడు సమావేశం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి సంపత్‌రెడ్డి తెలిపారు.

రామగుండం: అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో నేడు ఉదయం గం 10.30 లకు కంటి వెలుగుపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భూక్య యాదగిరి తెలిపారు. ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

14న శ్రీగోదారంగనాయకుల కల్యాణం

రామగిరి: మండలం పరిధిలోని లద్నాపూర్ శ్రీదేవీ భూదేవీ సహిత శ్రీగోదారంగనాయకుల ఆలయంలో ఈనెల 14న శ్రీగోదారంగనాయకుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల శ్రీనివాసాచార్యులు తెలిపారు.

టీఎస్ఎంఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా సాయి చరణ్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ టీఎస్ఎంఎస్ అధ్యక్షుడిగా సాయి చరణ్‌ను ఎన్నుకున్నట్లు పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్ కుమార్ బుధవారం ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా సతీశ్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

రైతు హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడిగా వేరాలు

ఓదెల: రైతు హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడిగా మండలంలోని గోపరపల్లె గ్రామానికి చెందిన కాశవేని వేరాలు నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బాబు, జిల్లా ఇన్‌చార్జి బియ్యపు శంకర్‌యాదవ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు వేరాలు కృతజ్ఞతలు తెలిపారు.

నిధులు మంజూరు

ధర్మారం: మండలంలోని నందిమేడారం, రామయ్యపల్లి గ్రామాలలో గౌడ సంఘం భవన నిర్మాణాలకు నిధులు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం నందిమేడారం, రామయ్యపల్లి గ్రామాలకు చెందిన గౌడసంఘం నాయకులకు మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రొసిడింగ్ కాపీలను అందించారు. కార్యక్రమంలో సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, ఎంపీటీసీలు మిట్ట తిరుపతి, కట్ట స్వామి, గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

ట్రినిటీలో ముందస్తు సంక్రాంతి వేడుకలు



పెద్దపల్లిరూరల్: ట్రినిటీ విద్యాసంస్థల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు వేషధారణ, భోగిమంటలను జరుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతపై అవగాహన కల్పించారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ముగ్గుల పోటీని నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు.